క్లుప్తంగా

ముగిసిన దివ్య అఖండనామ సంకీర్తన



భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న కోఆర్డినేటర్లు

మందస: మందస పట్టణంలోని శ్రీసత్యసాయి మందిరంలో వంద గంటల దివ్య అఖండనామ సంకీర్తన ఆదివారంతో ముగిసింది. ఈనెల 13న సంకీర్తన ప్రారంభమైంది. సత్యసాయి జయంతి ఉత్సవాల సందర్భంగా జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా ఆధ్యాత్మిక వెల్లివిరిసింది. సోంపేట, పలాస, మందస జోన్ల ఆధ్యాత్మిక కోఆర్డినేటర్లు, కన్వీనర్లు ఎస్.అనాదిగుప్త, కాశీవిశ్వనాథ్, బమ్మిడి భైరాగి, జె.శ్రీనివాసరావు, ఈశ్వరరావు, జగదీశ్వరరావు హాజరై ప్రసంగించారు. మానవ జీవితాన్ని తరింపజేయడానికి భగవన్నామ స్మరణ ఎంతో అవసరమన్నారు. 38 సమితులు అఖండనామ సంకీర్తనలో పాల్గొన్నాయి.

సెల్ టవర్ ఏర్పాటుకు భూమిపూజ



భుమిపూజ చేస్తున్న దేవదాస్‌రెడ్డి

కంచిలి: మఠం సరియాపల్లి గ్రామంలోని శివాలయం వద్ద స్థానిక వినియోగదారులు, ప్రజల సౌకర్యార్థం ఎయిర్‌టెల్ టవర్ ఏర్పాటు చేయనున్నారు. ఈ టవర్ ఏర్పాటు కోసం స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. స్థానిక సర్పంచ్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం, నాయకులు పురుషోత్తం, పైల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు అభినందనీయం



బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంబిస్తున్న నియోజక వర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్

సోంపేట: సోంపేట పరిసర గ్రామాల ప్రజల కోసం బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడం అభినందనీయం ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. సోంపేట పట్టణంలో ఉద్దానం బ్లడ్ బ్యాంక్‌ను ఆదివారం ప్రారంభించారు. బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడం వలన అత్యవసర పరిస్థితుల్లో నియోజకవర్గంలోని రోగులకు రక్తం అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సోంపేట, కంచిలి ఎంపీపీలు నిమ్మన దాస్, పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ నగిరి ప్రభావతి, పార్టీ నాయకులు ఇప్పిలి క్రిష్ణారావు, రజనీకుమార్ దొలాయి, పాండవ శేఖర్, వైద్యులు ఎస్.రాజేంద్ర ప్రసాద్, పి.శివాజీ, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి శివ పాల్గొన్నారు.

నూతన పింఛన్ల అందజేత



పింఛన్లను అందజేస్తున్న మంధాకిణీ

ఇచ్ఛాపురం రూరల్: జగన్నాధపురం గ్రామానికి చెందిన పలువురికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. వీటిని లబ్ధిదారులకు ఎంపీటీసీ సభ్యురాలు ఆశి మంధాకిణీ ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు మృతికి సంతాపం



సోంపేట: బారువ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు తెప్పల ఆదినారాయణ (56) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. ఇంట్లోనే గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు సోంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచారు. ఈయన గొనకపాడు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఆదినారాయణ మృతిపై ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సంతాపం తెలియజేశారు.

స్వేచ్ఛావతి అమ్మవారికి పూజలు

ఇచ్ఛాపురం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ కార్యకర్తలు గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినాయక చవితిని పురస్కరించుకొని మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

జై..జై..గణేశా..

గణపతి పూజకు సమయం ఆసన్నమైంది. సోమవారం జరుపుకునే చవితి పూజలు.. అదే రోజు నుంచి ప్రారంభం కానున్న నవరాత్రుల కోసం ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. పూజా సామగ్రి కొనుగోలు వచ్చేవారితో, విగ్రహాల తరలింపుతో పట్టణాలు, పల్లెలు ఆదివారం రోజంతా సందడిగా కనిపించాయి. మార్కెట్లు కిటకిటలాడాయి. ప్రధానంగా భారీగా ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రతిష్టించేందుకు సిద్ధం చేసుకున్న విగ్రహాలను వాహనాలపై తరలిస్తూ యువకులు సందడి చేశారు. అలాగే పర్యావరణానికి ముప్పులేకుండా ఉండేందుకు వీలుగా స్వచ్ఛందసంస్థలు, యువకులు, వివిధ సంఘాలు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.




వజ్రపుకొత్తూరు: కిటకిటలాడుతున్న పూండి మార్కెట్



కవిటిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల చేతుల్లో రూపుదిద్దుకున్న మట్టిగణపతులు







కంచిలి: వివిధ రూపాల్లో బొజ్జగణపయ్యలు



మందస: బాలిగాంలో మట్టి ప్రతిమలను అందజేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు



ఇచ్ఛాపురం:మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు



కాశీబుగ్గ: వాహనంలో భారీ విగ్రహాన్ని తరలిస్తూ..



టెక్కలి నుంచి గ్రామీణ ప్రాంతాలకు వాహనాల్లో తరలివెళ్తున్న విగ్రహాలు



కాశీబుగ్గ: పండ్లను కొనుగోలు చేస్తున్న జనం



కాశీబుగ్గలో పూలను విక్రయిస్తూ..



కాశీబుగ్గ: పాలవెల్లిలను విక్రయిస్తూ..

వైద్యం కోసం రూ. 20 వేల సాయం



వజ్రపుకొత్తూరు: సాయం అందిజేస్తున్న సేవా సమితి ప్రతినిధులు



సోంపేట: తెప్పల రాజుకు సాయాన్ని అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

వజ్రపుకొత్తూరు: పూండికి చెందిన యువతర సేవా సమితి బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న వ్యక్తికి రూ.20 వేలు ఆర్థిక సహాయం చేసి ఆదుకుంది. అమలపాడు గ్రామానికి చెందిన బొడ్డు రమేష్ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. వైద్యం కోసం రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని వైద్యులు తేల్చారు. ఈ విషయం తెలుసుకున్న యువతరం సేవా సమితి తమవంతు బాధ్యతగా సహాయం చేయాలని తలచి రమేష్ భార్యకు ఆర్థిసాయాన్న ఆదివారం అందజేశారు. సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చింత మురళి, కార్యదర్శి గౌరకల అశోక్, ఇన్‌చార్జిలు గున్న వెంకటరమణ, దున్న పెంటారావు, కెంగువ రాంబాబు, లక్ష్మణ్, సునీల్‌జ్యోతి, సాయి, ఈశ్వరరావు ఉన్నారు.

క్షతగాత్రుడుకి రూ. 35 వేలు..

సోంపేట: గొల్లగండి గ్రామానికి చెందిన సాయి భక్తుడు తెప్పల రాజు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. రెండు కాళ్లకు దెబ్బలు తగలడంతో నడవలేని స్థితిలో ఉన్నాడు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో సోంపేట శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు అండగా నిలిచారు. 35 వేల రూపాయలను సేకరించి తెప్పలరాజుకు ఆదివారం అందజేశారు. నెల రోజులకు సరిపడే కిరాణా సరుకులు కూడా అందించారు. సాయి ప్రతినిధులు ఈపరి రవికుమార్, కందుల కాశి, టంకాల బూపూజి, కోట క్రిష్ణ, ఉట్ల రాంప్రసాద్ ఉన్నారు.

తీరాన్ని కాపాడుకుందాం



ఇచ్ఛాపురం రూరల్: స్వచ్ఛ సాగర్-సురక్షిత సాగర్‌పై అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: సర్వ జీవరాశులకు ఎంతగానో ఉపయోగపడే సముద్ర తీరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని హైదరాబాద్‌కు చెందిన ఇన్ కాయిస్ సంస్థ పరిపాలనాధికారి టి.రాజశేఖర్ అన్నారు. అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ఇన్ కాయిస్, మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో డొంకూరు, లక్ష్మీపురం, శివకృష్ణాపురం సముద్ర తీరంలో 'స్వచ్ఛ సాగర్-సురక్షిత్ సాగర్' కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యవనరుల్లో సముద్రం ఒకటన్నారు. కాలుష్యపు కోరల్లోంచి జల జీవరాసులను కాపాడుకునేందుకు సముద్ర తీరం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తీర ప్రాంతాల్లో పర్యాటకులు ప్లాస్టిక్ వస్తువుల్ని వినియోగించకుండా అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు సంభావ్య ఫిషింగ్ జోన్ సలహాలు, సునామీ ముందస్తు హెచ్చరికలు, అధిక అలలు, తుఫాన్ ఉప్పెనలపై స్థానిక మత్స్యకారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బారువ మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ రమేష్, ఎస్సై శ్రీనివాస్, ఉమెన్ ఎస్సై శిరీష, ఏఎస్సై మాధవరావు, స్థానిక మత్స్యకార ప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్వకర్మకు ఘనంగా పూజలు



కంచిలి: విశ్వకర్మ పూజలో పాల్గొన్న భక్తులు



సోంపేట: విశ్వకర్మ పూజల్లో ఎంపీపీ నిమ్మన దాస్ తదితరులు



వజ్రపుకొత్తూరు రూరల్: ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

కంచిలి: మండల కేంద్రంలోని రైల్వే పబ్లిక్ వర్క్స్ ఇంజినీరింగ్ కార్యాయం ఆవరణలో విశ్వకర్మ పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా పనిముట్లకు ఆయుధ పూజ చేశారు.

సోంపేట: బెంకిలి గ్రామ పంచాయతీలోని ఉమామహేశ్వర దేవాలయం ఆవరణలో బెంకిలి, జింకిభద్ర పంచాయతీల చేతివృత్తికళాకారుల ఆధ్వర్యంలో విశ్వకర్మ పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో విగ్రహా ప్రతిష్ఠ చేశారు. మూడు రోజులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. సంగీత భజనలు ఏర్పాటు చేశారు. ఎంపీపీ నిమ్మన దాస్, కళాకారుల సంఘ ప్రతినిధులు కాశి భైరి, భైరి కుమారస్వామి, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: మండల కేంద్రం వజ్రపుకొత్తూరులోని కంచికామాక్షి అలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సంఘ పెద్దలు, మహిళలు, యువకులు ఉన్నారు.

టెక్కలి: స్థానిక శాఖా గ్రంథాలయంలో విశ్వకర్మకు పూజలు జరిగాయి. గ్రంథాలయాధికారి బి.రూపావతి ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేశారు. దైవిక వాస్తు శిల్పి విశ్వకర్మ అని ఆమె అన్నారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్సీ రామారావు



కరుణాకర్‌రెడ్డితో రామారావు దంపతులు

కవిటి: టీటీడీ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని ఆదివారం తన నివాసంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, చామంతి దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డిని దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

సామాజిక విప్లవకారుడు పెరియార్ రామస్వామి



రామస్వామి జయంతి కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ ప్రతినిధులు

టెక్కలి: ద్రావిడ ఉద్యమకారుడు, సామాజిక విప్లవకారుడు పెరియార్ రామస్వామి అని సమతా సైనిక్ దళ్ జిల్లా సమన్వయకర్త చల్లా రామారావు అన్నారు. ఆదివారం స్థానిక బీసీ బాలికల మేనేజ్‌మెంట్ వసతి గృహంలో రామస్వామి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మనువాద ఆదిపత్యానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన మహోన్నతమైన వ్యక్తి పెరియార్ రామస్వామి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, తాతారావు, రంగారావు, వార్డెన్ శ్రావణి పాల్గొన్నారు.

5 వేల మందికి పూజా సామగ్రి పంపిణీ



పూజా సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ బంకేశ్వరమ్మ ఆలయం వద్ద ఆదివారం ఐదు వేల మందికి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఆలయ అర్చకుడు రామానందస్వామి ఆధ్వర్యంలో విగ్రహాలతో పాటు పప్పు, బెల్లం, ఇతర పూజా సామగ్రి కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైశ్యరాజు మోహనరాజు, పాలవలస వైకుంఠరావు, కొర్రాయి బాలక్రిష్ణ, కొత్తకోట జనార్దన పాల్గొన్నారు.

వైఎస్సార్‌బీమా చెక్కు అందజేత



కోటబొమ్మాళి: చెక్కు అందజేస్తున్న సంజీవరావు



టెక్కలి: బూరగాంలో సాయాన్ని అందజేస్తున్న నాయకులు

కోటబొమ్మాళి: ఉప్పరిపేట గ్రామానికి చెందిన చెన్నంశెట్టి అప్పన్న ఇటీవల మృతి చెందారు. ఇతను వైఎస్సార్ బీమా పాలసీదారు. దీంతో ఆతని కుటుంబ సభ్యులకు లక్షల రూపాయల బీమా మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును సర్పంచ్ కాళ్ల సంజీవరావు ఆదివారం వారికి అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంటు చంద్రకళ, వార్డు సభ్యులు ఐ.చిరంజీవి, డి.ప్రదీప్ ఉన్నారు.

తక్షణ సాయం అందజేత

టెక్కలి: బూరగాం గ్రామానికి చెందిన పిన్నింటి భీమారావు ఇటీవల చనిపోయారు. ఇతను కూడా వైఎస్సార్ పాలసీదారుడు కావడంతో తక్షణ సాయంగా రూ.పది వేలు మంజూరైంది.ఈ మొత్తాన్ని అతని భార్య మాధవికి సర్పంచ్ ఎల్.సంజీవరావు, ఉప సర్పంచ్ డి.గురుమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకుడు జె.తిరుమలరెడ్డి, గ్రామ వలంటీర్ ఎన్.లోహిత్‌రెడ్డి, పి.హరికృష్ణ ఆదివారం అందజేశారు.

స్తంభించిన ట్రాఫిక్



కాశీబుగ్గ మూడురోడ్లు కూడలివద్ద ట్రాఫిక్



ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న సీఐ శంకరరావు, సిబ్బంది

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మూడు రోడ్ల కూడలి నుంచి కాశీబుగ్గ బస్టాండ్ వరకు ఆదివారం ట్రాఫిక్ నిలిచిపోయింది. వినాయక చవితి సామగ్రి కొనుగోలుకు వచ్చిన వారితో రోడ్లన్నీ కిక్కిరిసిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో కాశీబుగ్గ రూరల్ సీఐ జి.శంకరరావు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులతో పాటుగా ఆర్మ్‌డ్ ఫోర్స్‌తో ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

'గౌతు కుటుంబం చేసింది శూన్యం'



మాట్లాడుతున్న వెంకటరావు

పలాస: అనేక సంవత్సరాలు పదవులు అనుభవించిన గౌతు శ్యామసుందర శివాజీ కుటుంబం పలాస, సోంపేట ప్రాంతాలకు చేసింది శూన్యమని పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు పైల వెంకటరావు అన్నారు. రెండు ప్రాంతాల్లో ఏమి అభివృద్ధి చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. బ్రాహ్మణతర్ల గ్రామంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గౌతు శిరీషను ఎలాగైనా ఎమ్మెల్యేను చేయాలనే ఆరాటంలో మంత్రి సీదిరి అప్పలరాజుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. గతంలో అల్లుడు దర్శకత్వంలో తండ్రి, కుమార్తెలు కలిసి నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించారన్నారు. మంత్రి అప్పలరాజు హయాంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని చెప్పారు. సర్పంచ్ బాడాన పుష్ప, ఎంపీటీసీ సభ్యుడు తుంగాన రవణయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దంతం వైకుంఠరావు ఉన్నారు.

గ్యాస్ వినియోగదారులకు బీమా సౌకర్యం

కోటబొమ్మాళి: హెచ్‌పీ గ్యాస్ లబ్ధిదారులకు బీమా సౌకర్యాన్ని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ సంస్థ కల్పించింది. ఈ మేరకు ఆదివారం హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ప్రతినిధి జి.దీపక్‌సాయి కోటబొమ్మాళిలో గ్యాస్ వినియోగదారుల ఇళ్లకు వెళ్లి బీమా పథకానికి దరఖాస్తు చేయించారు. 200 రూపాయలు ప్రీమియం చెల్లిస్తే ఐదేళ్ల బీమా వర్తిస్తోందన్నారు.

మంత్రికి చిన్నారుల చవితి శుభాకాంక్షలు



మంత్రి సీదిరికి మట్టి గణపతిని అందజేస్తున్న చిన్నారులు

కాశీబుగ్గ: రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు పలాస సత్యసాయి విద్యావిహార్ చిన్నారులు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రిని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి పప్పుదినుసులతో చేసిన మట్టి వినాయకుడు విగ్రహాన్ని అందజేశారు.